క్లుప్తంగా

యోగా రాష్ట్ర పోటీలకు విద్యార్థి ఎంపిక



లక్ష్మీరసింహను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతన్న కె. లక్ష్మీ నరసింహ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మేరీ సునీతా తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రం నంద్యాలలో జరిగిన ఎస్జీఎఫ్ క్రీడల్లో లక్ష్మీ నరసింహ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడని హెచ్‌ఎం చెప్పారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థితోపాటు యోగా ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

జెడ్పీ స్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కల్లూరు: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో కల్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హుసేన్, మ్యాజిక్ బస్ సంస్థ మేనేజర్ యాసిన్ బాషా, అకడమిక్ ఎడ్యుకేటర్స్ శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయ్ ప్రతిమ ఏర్పాటు చేస్తాం

కర్నూలు(టౌన్): నగరంలో మాజీ ప్రధాని, స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయ్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని భారతీయ జనతా పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ యస్. రంగస్వామి కోరారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులు సుధాకర్, శ్రీనాథ్ వర్మ, మధుసూదన్‌గౌడ్, హరిప్రసాద్, గోవింద్, కాళింగి నరసింహావర్మ తదితరులతో కలిసి నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజకు వినతిపత్రం అందజేశారు.

12న సదస్సు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం ఆధ్వర్యంలో వ్యవసాయ రంగం సంక్షోభం-ప్రత్యామ్నాయ విధానాలు అనే అంశంపై అక్టోబర్ 12వ తేదీన రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ సదస్సుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు, సెంట్రల్ యూనివర్సిటీ(హైదరాబాద్) ప్రొఫెసర్ ఎస్. పురేంద్ర ప్రసాదు హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని మేధావులు, రైతులు పెద్ద ఎత్తున సదస్సుకు హాజరు కావాలని ఆయన కోరారు.

15 నుంచి విజయ దశమి వేడుకలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనా రా యణ స్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు విజయ దశమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివ రామకృష్ణ తెలిపారు. అమ్మవారిని రోజుకొక అలంకారంతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

కల్లూరు ఏఓపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కలెక్టర్‌ను కలిసి ఆమె చాంబరులో ఏఓ అక్రమాలపై వినతిపత్రం ఇచ్చారు. కొందరు విత్తన వ్యాపారులతో కలిసి నకిలీలను రైతులకు అంటగట్టడంలో ఏఓ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. అనంతరం వ్యవసాయాధికారి వరలక్ష్మి, డీఆర్వో కె.మధుసూదనరావుకు కూడా ఆయన వినతిపత్రాలు అందజేశారు.

పర్యాటక ప్రదేశాలపై అవగాహన అవసరం

కర్నూలు కల్చరల్: పర్యాటక ప్రదేశాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఏపీ పర్యాటక సాంస్కృతిక శాఖ జిల్లా అధికారి విజయ అన్నారు. మంగళవారం సిల్వర్ జూబ్లీ కళాశాల కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్ సభ్యులు నగర శివారులోని లక్ష్మీ జగన్నాథ గట్టును సందర్శించారు. 'పచ్చదనం పరిశుభ్రత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రావెల్ ఫర్ లైఫ్ ప్రతిజ్ఞ చేశారు. జగన్నాథ గట్టులో ఉన్న మెడిసినల్ ప్లాంట్స్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ వెంకన్న, అధ్యాపకులు నాగరాజు శెట్టి, బాలరాజు, మీర్ అల్తాఫ్ అహ్మద్, బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజారోగ్యానికి రక్ష

- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
- మారుమూల పల్లెలకు సైతం మెరుగైన వైద్యం
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మారుమూల పల్లెల ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందజేస్తున్నారన్నారు. కర్నూలు రూరల్ మండలం పరిధిలోని జి.సింగవరం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్య నిపుణులు ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ క్యాంప్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే సైతం ఓ మహిళకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణులు ఆరోగ్యం విషయంలో కొంతమేర నిర్లక్ష్యం చేస్తుంటారని, వాటికి స్వస్తి చెప్పాలని సూచించారు. అనారోగ్యం కారణంగా ఏ కుటుంబ పెద్ద కూడా ప్రాణాలు పోగొట్టుకునేందుకు అవకాశం లేకుండా ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామంలోకే అంబులెన్స్‌లు వస్తున్నాయని, ప్రతి ఒక్కరు కూడా ఆరోగ్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. సాధారణంగా ఫ్యామిలీ డాక్టర్ అనే కాన్సెప్ట్ ఆర్థికంగా ఉన్న వారికి మాత్రమే ఉంటారని, అయితే సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు సైతం ఉచితంగా అందజేస్తున్నారని గుర్తు చేశారు. దీర్ఘకాలిక వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరు బీపీ, షుగర్‌తో పాటు ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మహబూబ్ బాషా, డిప్యూటీ తహసీల్దార్ భాను పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలన తీరును గుర్తించాలి

కర్నూలు సిటీ: ప్రజల వద్దకే పాలన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. జి.సింగవరంలో హెల్త్ క్యాంప్ ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలు వర్తించాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, అయినా ప్రయోజనం చేకూరేది కాదని చెప్పారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఎవరి సిఫారసు అవసరం లేదని, అర్హత ఉంటే సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయని గుర్తు చేశారు. లంచాలు, దళారీలు, నాయకుల ప్రమేయం ఏ మాత్రం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల పాలన తీరును గమనించాలని, మీ కుటుంబాలకు చేకూరిని లబ్ధిని ప్రతిఒక్కర గుర్తించాలన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరో మారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సంద్భంగా ఎమ్మెల్యే కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

కల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన కల్లూరు మండలం నాయకల్లు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య శిబిరంలో ప్రజలకు, రోగులకు కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ప్రజలకు కేస్ షీట్, మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలు వైద్యానికి ఇబ్బందులు పడకూడదనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. మలేరియా, డెంగీ, టీబీ, మధుమేహం, హిమోగ్లోబిన్, కంటి, గల్ల మొదలగు పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, గ్రామ నాయకులు, వైద్యాధికారులు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో స్వగ్రామంలోనే మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు సునీతా, రహేలా 404మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 54మందికి కంటి పరీక్షలు చేసి అద్దాల కోసం రెఫర్ చేసినట్లు డాక్టర్లు తెలిపారు. మరో ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రుడు, ఎంపీటీసీ సభ్యుడు రమ ణయ్య, వైద్య సిబ్బంది సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. సి.బెళగల్ మండలంలోని కొండాపురంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 434 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ హరిచంద్రుడు తెలిపారు. అధికారులు, డాక్టర్లు, సచివాలయ కన్వీనర్లతో సర్పంచ్ రత్నమ్మ కలిసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజేష్, సుధాకర్, వైద్య అధికారులు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జయన్న అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. హెల్త్ క్యాంపును ఎంపీడీఓ, తహసీల్దార్ పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచాలన్నది ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలతోపాటు మందులు అందజేస్తున్న హెల్త్ క్యాప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవానలి సూచించారు. హెల్త్ క్యాంపుకు ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. క్యాంపునకు సుమారు 350మందికిపైగా ప్రజలు తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్లు జయంతి, నస్రీన్, మధన్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్



బెళగల్ : మండలం కొండాపురంలో వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం



హెల్త్ క్యాంపును ఎపరిశీలిస్తున్న తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎంపీడీఓ దస్తగిరి

జగనన్న సురక్ష.. పేదల ఆరోగ్యానికి రక్ష



మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న హేమలత

ఓర్వకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తోందని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిని హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ముందుగా కార్యక్రమ ప్రయోజనాలపై వైద్య శిబిరానికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఆరోగ్య సమస్యలు వున్నవారికి వరం లాంటిదన్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఉన్నతాసుపత్రులకు తరలిస్తారన్నారు. ఫ్లిప్ బుక్ ద్వారా మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. రొమ్ము క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని పేర్కొన్నారు. రొమ్ములో గడ్డ, వాపు, కణితి, ఎర్రబడటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే మమోగ్రామ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్.లీలాశ్రీ, డాక్టర్.వాసు, డాక్టర్ రజని, డాక్టర్.రాఘవ, ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ జయమ్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కంబదహాల్‌లో హెల్త్ క్యాంప్

సి.బెళగల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కంబదహాల్‌లో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం ప్రటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌లో వైద్య నిపుణులు ఆరోగ్య పరిక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవానలి సూచించారు.

12న హుండీ కానుకల లెక్కింపు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని హుండీ కానుకలను ఈనెల 12న లెక్కింపు చేపడుతున్నామని ఈఓ రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఉదయం 8గంటలకు ఈ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. గ్రామ పెద్దలు, పోలీసులు, అధికారుల సమక్షంలో హుండీ కానుకలు లెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు.

నాటు సారా విక్రేతలు అరెస్ట్

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో నాటుసారాను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన చిందుకూరు నాగేశ్వరరావు, వెంకటసుబ్బన్న స్థానిక వేంకటేశ్వర స్వామి గుడి వద్ద నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

జిల్లా గోరక్షణ మహా సంఘం ట్రస్ట్ బోర్డు నియామకం

కర్నూలు కల్చరల్: జిల్లా గో రక్షణ మహా సంఘం ట్రస్ట్ బోర్డును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్ట్ బోర్డు సభ్యులుగా పి.ఆదిమోహన్‌రెడ్డి, పి.శేషయ్య, వి.విజయ భాస్కర్‌రెడ్డి, ఎమ్.శకుంతల, వై. పార్వతమ్మ, జి.ఎమ్.కవిత, ఎమ్.జవహర్‌లాల్ బాబును నియమించారు. వీరిలో ఒకరిని ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ప్రకటిస్తారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి రెండు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారు.

మట్కా బీటర్ అరెస్టు

కర్నూలు : బనగానపల్లె మండలం నందివర్గంకు చెందిన బండెల శాంతరాజ్ అనే మట్కా బీటర్‌ను కర్నూలు మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక నందికొట్కూరు రోడ్డులోని ఒమెగా హాస్పిటల్ సమీపంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో మట్కా చీటీలు రాస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. శాంతరాజ్‌పై కేసు నమోదు చేసి రూ.45 వేలు నగదు, రెండు మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు మూడో పట్టణ సీఐ డి.మురళీధర్‌రెడ్డి తెలిపారు.

కారకులను శిక్షించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ గార్డు వడ్డే పద్మ ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ ఎస్‌ఐలపై చర్యలు తీసుకోవాలని సీటీఐయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వడ్డేపద్మను వారు మంగళవారం పరామర్శించారు. గత రెండేళ్ల క్రితం టెండర్ దక్కించుకున్న ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ వారు సరైన జీతం ఇవ్వకుండా తక్కువ పీఎఫ్ చెలిస్తూ మోసం చేస్తున్నారన్నారు. తమకు అనుకూలురైన వారిని ఎస్‌ఐలుగా నియమించుకుని కార్మికులను భయభ్రాంతులకు లోనుచేస్తున్నారని విమర్శించారు. వడ్డే పద్మ ఎలాంటి తప్పు చేయకపోయినా ఎస్‌ఐలు ఫిరోజ్, రవితేజ వేధించారన్నారు. ఈ అవమానాలను భరించలేక పద్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట



రైతులకు వేరుశనగ విత్తనాలను అందజేస్తున్న ఏడీఏ సాలురెడ్డి, ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. మంగళవారం కోడుమూరు రైతు భరోసా కేంద్రంలో ఏఓ రవిప్రకాష్‌తో కలిసి ఏడీఏ సాలురెడ్డి ప్యాలకుర్తి రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలను, ఎరువులు, మందులను ప్రభుత్వం సకాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీ సీజన్‌కుగాను వర్షాలు సరిగా పడనందున రైతులు తొందరపడి విత్తనం వేసుకోకుండా వేచిచూడాలని ఏఓ సూచించారు. వర్షాలు బాగా పడిన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలని చెప్పారు.

మందుల దుకాణాల తనిఖీ

విత్తనాల పంపిణీ అనంతరం ఏడీఏ సాలురెడ్డి, ఏఓ రవిప్రకాష్ పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలు తనిఖీ చేశారు. రికార్డులు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అనుమతి పొందిన ఎరువులు, మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని ఈ సందర్భంగా వారు దుకాణాల నిర్వాహకులకు సూచించారు. అనుమతి లేనివాటిని విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



అమడగుంట్ల సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్ : సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని అమడగుంట్ల గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ మంజల తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకునేలా చైతన్య పరచాలని సూచించారు.

బయోమెట్రిక్ ద్వారానే యూరియా అమ్మాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: రైతులకు యూరియాను తప్పనిసరిగి బయోమెట్రిక్ ద్వారానే అమ్మకాలు చేయాలని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ మల్లేష్‌కుమార్‌తో కలిసి ఆయన పురుగు మందులు, ఎరువులు, విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువులు, మందుల అమ్మకాలు చేపట్టాలన్నారు. అదేవిధంగా నిల్వలు, అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈఓ సిద్దు, ఎంపీఈఓ వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు ప్రోత్సహం

- డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి



చిన్నటేకూరులో మల్లెతోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన ఉద్యాన రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ) అమరనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన రైతు శేఖర్ మల్లెతోటను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామంలో 30 మంది రైతులకు మల్లెతోట సాగుకు ప్రోత్సహం అందించామన్నారు. వారికి తోట నిర్వహణకు ఖర్చులు లభిస్తున్నాయన్నారు. అలాగే ఉపాధి పథకం పేర్ల బోర్డును కూడా పరిశీలించారు. కార్యక్రమంలో సీఎల్‌ఆర్సీ కోర్స్ డైరెక్టర్ ఎర్రమల, ఫీల్డ్ అసిస్టెంట్ ఇలియాస్ పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత



అదనపు గదులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

గడివేముల: సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఉందని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రం గడివేముల జెడ్పీ హైస్కూల్లో నూతనంగా నిర్మించిన రెండు అదనపు గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ సర్కార్ నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీంతో ప్రతి ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం జెడ్పీటీసీ చంద్రశేఖర్ రెడ్డిని హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానియేల్‌తో పాటు ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తలారి బాలచెన్ని, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న తహసీల్దార్ జయన్న

కోడుమూరు: ప్రజలకు అందజేసే నిత్యావసర వస్తువుల పంపిణీ తూకాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ జయన్న రేషన్ డీలర్లు, బియ్యం పంపిణీ వాహనదారులను హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు, రేషన్ దుకాణాలు, బియ్యం పంపిణీ వాహనదారులతో సివిల్ సప్లై డీటీ నవీన్‌కుమార్‌తో కలిసి తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ దుకాణాలు, బియ్యం పంపిణీ వాహనదారులపై కమిటీ సభ్యులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. తూకాల్లో తేడాలు రాకుండా చూసుకోవాలని, సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీటీ రామాంజినేయులు, వీఆర్వోలు సంజీవరెడ్డి, ఎల్లప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



బాలికల సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య

కర్నూలు (టౌన్): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్కైకింగ్, రగ్బీ, నెట్‌బాల్, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడాంశాల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రీడలపై ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది స్కూల్‌గేమ్స్ నిర్వహిస్తుందన్నారు. ఇందులో మంచి ప్రతిభ చాటితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించవచ్చునన్నారు. కార్యక్రమంలో బి. క్యాంపు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, క్రీడా సంఘాల ప్రతినిధులు చిట్టిబాబు, నాగరత్నమయ్య, వంశీక్రిష్ణ పాల్గొన్నారు.

'వరి' కళ కళ!



తుంగభద్ర నదీతీర గ్రామాల్లో కళ కళలాడుతున్న వరి పంట

కర్నూలు సిటీ: కర్నూలు-కడప కాలువ కింద సాగు చేసిన వరిపైరు కళకళలాడుతుంది. కర్నూలు మండల పరిధిలోని తుంగభద్ర నదీతీర గ్రామాల్లో సాగు చేసిన వరిపైరు పచ్చగా మెరుస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అశించి స్థాయిలో వర్షాలు లేకపోయినా నది తీరంలోని గ్రామాల్లో అందుబాటులో ఉన్న నీటి లభ్యతోనే పంటలను సాగు చేశారు. సుంకేసుల బ్యారేజీ దగ్గర నుంచి కేసీ కెనాల్ 0 కి.మీ నుంచి 56 కి.మీ వరకు స్థిరీకరించిన ఆయకట్టు 1850 ఎకరాలు ఉంది. ఇందులో వరి పంటనే సుమారుగా వెయ్యి ఎకరాల్లో ఆయకట్టు సాగు చేసినట్లు కేసీ ఇంజినీర్లు చెబుతున్నారు. ప్రస్తుతం తీరం వెంబడి గ్రామాల్లో సాగు చేసిన వరి కళకళలాడుతూ చూపరులను ఆకట్టుకుంటుంది.